నమస్తే తెలంగాణ
# ఖమ్మం
3 | ఖమ్మం, శనివారం 9 మార్చి 2024 | KHAMMAM


తీర్థాల సంగమేశ్వరాలయంలో శివలింగానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు


స్నానాల లక్ష్మీపురంలో కిక్కిరిసిన భక్తజనం


తీర్థాల సంగమేశ్వరాలయంలో భారీగా క్యూ కట్టిన భక్తులు

- ఉమ్మడి జిల్లాలో శివనామ స్మరణ చేసిన శైవాలయాలు
- మహాశివుడి దర్శన భాగ్యంతో తరించిన భక్తజనం
- రాత్రంతా శివయ్య నామస్మరణతో జాగారం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల
- వేసవి దృష్ట్యా భక్తులకు మజ్జిగ పంపిణీ చేసిన నిర్వాహకులు





# నాగేంద్ర హారాయ.. త్రిలోచనాయ


కూసుమంచి శివాలయంలో అభిషేకం చేస్తున్న పూజారులు


తీర్థాల వద్ద మున్నేటిలో స్నానమాచరిస్తున్న భక్తులు

భక్తుల శివనామ జపంతో శైవాలయాలు మార్మోగాయి. శివుడికి ప్రీతిపాత్రమైన రోజు మహా శివరాత్రి పర్వదినాన 'హర హర మహాదేవ శంభో శంకర' అంటూ తెల్లవారుజాము నుంచే నినదించాయి. 'శివ శివ శంకర.. భక్తవ శంకర', 'ఓం నమఃశివాయ.. ఓం నమఃశివాయ' అంటూ భక్తిభావంతో కొలిచాయి. శివయ్యను భక్తిభావంతో కొలుస్తూ.. తలుస్తూ ఆధ్యాత్మిక శోభతో పరిఢవిల్లాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీతో ఆలయాలు కిటకిటలాడాయి. కూసుమంచి శివాలయానికి జిల్లా నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి పూజలు చేశారు. పెనుబల్లి మండలం భవన్నపాలెంలోని నీలాద్రీశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. స్వామి వారిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య దర్శించుకొని పూజలు చేశారు. అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా.. భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు స్వామివారిని దర్శించుకున్నారు. రూరల్ మండలం తీర్థాల సంగమేశ్వరస్వామి ఆలయంలో భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకున్నారు. ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం రామలింగేశ్వరస్వామిని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. బూర్గంపాడు మండలం మోతే పట్టీనగర్‌లోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని భక్తులు దర్శించుకొని పూజలు చేశారు. మధిరలోని మున్నేరు నది ఒడ్డున ఉన్న మృత్యుంజయస్వామిని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు దర్శించుకున్నారు. ఖమ్మం కాల్వొడ్డులోని గుంటుమల్లేశ్వరస్వామి ఆలయానికి భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూ కట్టారు. స్వామివారిని వరుస క్రమంలో దర్శించుకునేందుకు నిర్వాహకులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. జూలూరుపాడు మండలం పాపకొల్లులోని ఉమా సోమలింగేశ్వరస్వామి ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. పలు ఆలయాల్లో వేసవి దృష్ట్యా నిర్వాహకులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రంతా శివయ్య నామ స్మరణతో భక్తులు జాగారం చేశారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మార్చి 8


చిన్నారులను భుజానికెత్తుకుని ఆలయానికి వస్తున్న తండ్రులు


తీర్థాల వద్ద మున్నేటిలో స్నానమాచరిస్తున్న భక్తులు


కూటి కోసం కోటి విద్యలు..


జాతరలో వంట చేస్తున్న భక్తులు


పిండప్రదానాలు చేస్తున్న కుటుంబ సభ్యులు


స్నానాల లక్ష్మీపురంలో డిప్యూటీ సీఎం ప్రత్యేక పూజలు


నీలాద్రిలో మంత్రి తుమ్మలను ఆశీర్వదిస్తున్న ఆలయ పూజారి


లింగాల శివాలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర పూజలు


తీర్థాలలో మేయర్ నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని..


కూసుమంచి శివాలయంలో తుంబూరి దయాకర్ పూజలు..


మణుగూరులో ఎమ్మెల్యే పాయం పూజలు..


కొత్తగూడెం గణేశ్ టెంపుల్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

# సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారు

## వివరాలు వెల్లడించిన కలెక్టర్ ప్రియాంక ఆల


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల


భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ నెల 11న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఖరారైందని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. శుక్రవారం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఆమె పలు సూచనలు చేశారు. సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి , డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర క్యాబినెట్ మంత్రులతో కలిసి భద్రాచలంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఉదయం సీతారామచంద్రస్వామిని దర్శించుకొని తర్వాత మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అక్కడే 3 వేల మంది సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారని, భోజన విరామం తర్వాత మణుగూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. హెలీపాడ్, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. హెలీప్యాడ్ వద్ద అంబులెన్స్, డాక్టర్లు, ఫైరింజన్ తదితర అత్యవసర ఏర్పాట్లు చేయాలన్నారు. కల్యాణ మండపం వద్ద ఎలక్ట్రికల్, జనరేటర్, ఏసీల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్వో రవీంద్రనాథ్, డీఆర్‌డీవో విద్యాచందన, జిల్లా పరిపాలనాధికారి గన్యా, డీఎంహెచ్‌వో శిరీష, డీఎస్‌వో రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పాయం

మణుగూరుటౌన్, మార్చి 8 : ప్రజా దీవెన సభకు సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 11న మణుగూరుకు రానున్న నేపథ్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సభ ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెలీప్యాడ్, ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పార్కింగ్, సభ నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను డీఎస్పీ రవీందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

# కాలనీళ్ల కష్టాలు



మండు వేసవి రాకముందే తాగునీటి కోసం తండ్లాట షురువైంది. తలాపునే ఉన్న మున్నేరు నీరు లేక ఏడారిని తలపిస్తోంది. చేతిలో బిందె, ప్లాస్టిక్ బకెట్లతో బోర్‌లు, ట్యాంకుల వద్దకు మహిళల పరుగందుకుంది. ట్యాంకర్ రాగానే నీళ్ల కోసం తాపత్రయం ఆరంభమైంది. చిన్నాపెద్దా తేడా లేకుండా వరుసబెట్టి నీటిని పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో నాలుగు రోజులుగా నల్లాలు రాకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని డివిజన్లలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తుండగా.. మరికొన్ని డివిజన్లలో నీరు రాక ప్రజలు పడిగాపులు కాస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చిన్న నీటి సమస్య తలెత్తినా అప్పటికప్పుడే పరిష్కారం లభించేది. నీటి సమస్య తీరేది. కానీ.. ఇప్పుడు తమ గోడు ఎవరికి చెప్పుకోవాలని నగరవాసులు దిగులు చెందుతున్నారు. నీటి సమస్య ఇంత తీవ్రంగా ఉన్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. –ఫొటోగ్రాఫర్, ఖమ్మం





- ట్యాంకర్ వద్దకు బిందె, బకెట్లతో పరుగో పరుగు
- పలు డివిజన్లలో ట్యాంకర్లు రాక ప్రజల అవస్థలు
- నీళ్ల కోసం ఇళ్ల ముందు పొద్దంతా పడిగాపులు

